క్లుప్తంగా

రావిఆకుపై ఎర్రకోట



పొదలకూరు: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావిఆకుపై ఎర్రకోట, జాతీయ జెండా బొమ్మను గీశారు.

పెయింటింగ్ పనిచేస్తూ..

• విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

విడవలూరు: పెయింటింగ్ పనిచేస్తూ విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని వావిళ్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెం గ్రామానికి చెందిన కత్తుల వినీల్ (24) పెయింట్ పని చేస్తుంటాడు. అతనికి విడవలూరు మండలంలోని వావిళ్ల ఎస్టీ కాలనీకి చెందిన మహిళతో ఐదు నెలల క్రితం వివాహమైంది. తన భార్యతో కలిసి రెండురోజుల క్రితం వావిళ్లలోని అత్తింటికి వచ్చాడు. కాగా గ్రామానికి చెందిన సాయిచరణ్ అనే వ్యక్తితో కలిసి ఓ ఇంటికి పెయింటింగ్ పనికి వెళ్లాడు. తాడు సాయంతో పెయింట్ వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి కింద పడిపోయాడు. పక్కనే పనిచేస్తున్న సాయిచరణ్ గుర్తించి కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే వినీల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్సై నరేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

నెల్లూరు(పొగతోట): సర్వీస్ హోమ్‌లో ఉంటున్న బాలికలు, మహిళలకు నాణ్యమైన భోజనం, తాగునీరు ఇతర సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని సర్వీస్ హోంను ఆమె గురువారం పరిశీలించారు. బియ్యం, కూరగాయలు, సరుకులు, తాగునీటి ప్రమాణాలను తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ హోమ్‌లో ఉంటున్న బాలికలు, మహిళలకు నాణ్యమైన భోజనం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నాణ్యత విషయంలో లోటుపాట్లు జరిగితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణాధికారి టి.అరుణ పాల్గొన్నారు.

ఇరుగాళమ్మ సన్నిధిలో విశేష పూజలు నేడు

నెల్లూరు(బృందావనం): శ్రావణ మాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నేడు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ గిరికృష్ణ గురువారం తెలిపారు. ఈ క్రమంలో మూలవర్లకు ఉదయం 6.30 గంటలకు అభిషేకం, 8 గంటలకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జెండా వందనం, సాయంత్రం 4.30 గంటలకు హోమం, 6.30కి పుష్పయాగం ఉంటుందన్నారు. అదేవిధంగా వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

నెల్లూరు(అర్బన్): వర్షాలు పడుతున్న నేపథ్యంలో జిల్లాలో డెంగీ, చికెన్‌గన్యా, మలేరియా లాంటి జబ్బులను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించి, మాట్లాడారు. మలేరియా, డెంగీ లాంటి జబ్బులు నమోదైన చోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఆయా ప్రాంతాల్లో కీటకజనిత వ్యాధుల నివారణకు మలాథియాన్ స్ప్రే చేయాలన్నారు. నీటి గుంతల్లో దోమల లార్వాలు తినే గంబూసియా చేపలను వదలాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ సెక్రటరీల సాయంతో వాటర్ ట్యాంకులను క్లీనింగ్ చేయించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం సదాశివపురం గ్రామానికి చెందిన పి.మునిశంకర్ ఈనెల 9వ తేదీన నెల్లూరుకు వచ్చారు. పొదలకూరు రోడ్డు హెచ్‌ఆర్ కల్యాణ మండపం సమీపంలోని హోటల్ వద్ద తన యమహా క్రక్స్ బైక్‌ను నిలిపారు. హోటల్‌లో టిఫిన్ చేసి బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు గురువారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ విభాగం ఈఈలు రహంతు జానీ, శేషగిరిరావు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు.

చెదిరిన సొంతింటి కల

- విజిలెన్స్ విచారణతో ఆగిన నిర్మాణాలు
- క్వాలిటీ కంట్రోల్ నివేదిక రావాలంటున్న అధికారులు
- కాంట్రాక్టర్ల ద్వారా 750 ఇళ్ల నిర్మాణం
- 250 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్లో నిలిపివేత
- కాంట్రాక్టర్ల వద్దే పనులు చేయించాలని కలెక్టర్ ఆదేశం



శ్లాబ్ పడిన లేఅవుట్లోని గృహాలు

పొదలకూరు: పేదల సొంతింటి కల సాకారం చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది. జగనన్న కాలనీల పేరుతో లేఅవుట్లను నిర్మించింది. పెద్ద ఊర్లనే ఏర్పాటు చేసి పేదలకు ఇళ్లు అందజేయాలని మూడు ఆప్షన్లను పెట్టి ఇళ్ల నిర్మాణం చేపట్టింది. జిల్లాలో కావలి తర్వాత పొదలకూరు ప్రభుత్వ లేఅవుటే అతిపెద్దదిగా గుర్తింపు పొందింది. పట్టణానికి సమీపంలోని చిట్టేపల్లి తిప్ప వద్ద ఏర్పాటు చేశారు. తాము సొంతంగా నిర్మించుకోలేమని లబ్ధిదారులు సమ్మతి పత్రం అందజేశారు. గృహనిర్మాణ శాఖ తొలివిడతగా 750 ఇళ్లను నిర్మించేందుకు కాంట్రాక్టర్లకు అప్పగించింది.

1,400 ప్లాట్లు

ఇక్కడ మొత్తం 1,400 ప్లాట్లు ఒక్కొక్కరికి 9 అంకణాల వంతున అందజేయడం జరిగింది. లేఅవుట్లో కాంట్రాక్టర్లు 750 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి 500 ఇళ్లకు శ్లాబులు, 250 ఇళ్లకు బేస్‌మెంట్‌ను పూర్తి చేశారు. పెద్ద లేఅవుట్ కావడంతోపాటు ప్లాట్ల నంబర్లు మారిపోవడంతో లబ్ధిదారులతోపాటు, కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడ్డారు. ఇళ్ల నిర్మాణం కోసం కాంట్రాక్టర్లకు సుమారు రూ.3 కోట్లు నిధులు కూడా మంజూరు చేసినట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. లేఅవుట్లో విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు.

విచారణతో జాప్యం

లేఅవుట్లో అక్రమాలు జరిగాయంటూ ఏడాది క్రితం ఏర్పడిన కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ నిర్వహించాల్సిందిగా విజిలెన్స్‌కు అప్పగించింది. ఈ క్రమంలో అధికారులు పలుమార్లు లేఅవుట్ వద్దకు వచ్చి పరిశీలించారు. ప్లాట్లు నిర్మాణం, ఇళ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు, అర్హులైన వారికి ప్లాట్ల కేటాయింపు తదితర అంశాలపై విచారణ నిర్వహించారు. దీంతో పేదల గూడుకు కష్టం వచ్చింది. విచారణ సాగదీత ధోరణిలో ఉండటంతో నిర్మాణంలో మరింత జాప్యం జరిగేలా ఉందని తెలుస్తోంది. దీనికితోడు ఇళ్ల నిర్మాణంలో ప్రాథమిక నిబంధనలు పాటించలేదని క్వాలిటీ కంట్రోలు విభాగం పరిశీలించి నివేదిక సమర్పిస్తేనే తిరిగి పనులు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ ఆదేశించడంతో దాని కోసం అధికారులు వేచిచూస్తున్నారు.

వారికే పనులు

గతంలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ల వద్దనే పనులు చేయించేందుకు కలెక్టర్ ఆదేశించారు. కింది స్థాయి అధికారులను ఆ దిశగా చర్యలు చేపట్టాలని సూచించడంతో ఇటీవల పాత కాంట్రాక్టర్లు మండల స్థాయి అధికారులను కలిశారు. అయితే విజిలెన్స్, క్వాలిటీ కంట్రోలు నివేదిక ఇంకా అందకపోవడంతో పనులను అప్పగించేందుకు వీలులేకుండాపోయింది. ఆ రెండు నివేదికలు పూర్తిస్థాయిలో అందితేనే కాంట్రాక్టర్ల వద్ద తిరిగి పనులను ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని వెల్లడిస్తున్నారు. అయితే పేదల సొంతంటి కల వివిధ కారణాలతో చెదిరింది.



బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణాలు

నివేదికలు రావాలి



లేఅవుట్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి విజిలెన్స్, క్వాలిటీ కంట్రోలు నివేదికలు రావాలి. తిరుపతి ఎస్వీ సివిల్ ఇంజినీరింగ్ ల్యాబ్‌కు క్వాలిటీ కంట్రోల్ అధికారులు శాంపిల్స్‌ను పంపారు. విజిలెన్స్ విచారణ నివేదిక ఏ దశలో ఉందో తెలియాల్సి ఉంది. ఉత్తర్వులు అందిన వెంటనే తిరిగి పనులు చేపడతాం.

– మహేష్, హౌసింగ్ ఏఈ, పొదలకూరు

కాంట్రాక్టర్లు కలిశారు



లేఅవుట్లో గృహ నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు కలిశారు. అయితే మా చేతుల్లో ఏమి లేదని వారికి వెల్లడించడం జరిగింది. కలెక్టర్ ఆదేశాల మేరకు వారికే పనులను అప్పగించాలంటే ముందుగా విజిలెన్స్, క్వాలిటీ కంట్రోలు నుంచి క్లియరెన్స్ అందాల్సి ఉంది.

– డీవీ నరసింహారావు, ఎంపీడీఓ, పొదలకూరు

ఉచితం సరే.. బస్సులేవీ?

- గ్రామీణ ప్రాంతాలకు దూరంగా ఆర్టీసీ సేవలు
- ఆటోలు, ప్రైవేటు వాహనాలే దిక్కు



కోవూరు: కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ ఊదరగొడుతోంది. అయితే అసలు గ్రామాలకు బస్సులు ఉంటే కదా అని వారు నిట్టూరుస్తున్నారు. కోవూరు నియోజకవర్గంలో 80 శాతం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేవు. కొన్నిచోట్ల ఉన్నా అవి సమయపాలన పాటించడం లేదు. ఫలితంగా అధిక శాతం గ్రామీణ ప్రజలు ఆటోలు, ప్రవేటు వాహనాలపైనే ఆధారపడుతున్నారు.

ప్రచారమే తప్ప ఏమీలేదు

మహిళలకు ఉచిత ప్రయాణం పేరుతో కూటమి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోంది. కానీ పల్లెలోకి ఒక బస్సు అడుగు పెట్టడం లేదు. కోవూరు, కొడవలూరు, ఇందుకూరుపేట ప్రాంతాల ప్రజలు నెల్లూరుతో పాటు సమీప పట్టణాలకు వెళ్లాల్సి వస్తే ప్రైవేటు ఆటోల్లో అధిక చార్జీలు చెల్లించాలి. ఎప్పుడో ఒకసారి వచ్చే ప్రైవేట్ వాహనాల కోసం గంటల తరబడి వేచి చూడాలి.

విద్యార్థులు, రోగులకు అవస్థలు

గ్రామాలకు బస్సులు వెళ్లకపోడడంతో కోవూరు, నెల్లూరులో చదువుతున్న విద్యార్థులు పాఠశాలలు, కాలేజీలకు సమయానికి చేరుకోవడం సాధ్యం కావడం లేదు. రవాణా సౌకర్యం లేక ప్రతిరోజూ ఆలస్యమవుతూ, చదువులో వెనుకబడుతున్నారు. అదేవిధంగా గ్రామాల నుంచి నెల్లూరు నగరంలోని ఆస్పత్రికి రావాలన్నా నరకయాతన అనుభవిస్తున్నారు. వృద్ధులు, గర్భిణుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సమయానికి వాహనం దొరక్క ప్రాణాపాయం ఎదురైన సందర్భాలూ ఉన్నాయి.

బస్సు సేవల్లేని గ్రామాలు

మండలం	గ్రామాలు
కోవూరు	చెర్లోపాళెం, గంగవరం, జమ్మిపాళెం
ఇందుకూరుపేట	పున్నూరు, జంగంవానిదొరువు, పాములవారిపాళెం
కొడవలూరు	ఆలూరుపాడు, మానేగుంటపాడు, రామన్నపాళెం
బుచ్చిరెడ్డిపాళెం	రెడ్డిగుంట, వవ్వేరు, మినగల్లు, పంచేడు, కాగులపాడు

ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరణ



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పొదలకూరు: పట్టణం నుంచి తెల్లవారుజామున 4:30 గంటలకు నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ వరకు ఉన్న ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించడం జరిగిందని బీజేపీ నాయకులు వెల్లడించారు. స్థానిక బస్టాండ్ వద్ద వారు గురువారం మాట్లాడుతూ పది రోజులుగా సర్వీసు ఆగిందని నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించినట్టు తెలిపారు. దీంతో యాథావిధిగా సర్వీసును పునరుద్ధరించడం జరిగిందన్నారు. ఈ సర్వీసు చాలామంది ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, ధనంజయరావు, గురుస్వామి, చొప్పా వెంకటేశ్వర్లు, జనార్దనరెడ్డి, పిచ్చయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం జరిపిస్తున్న అర్చకులు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో కొలువైన మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ, పోతురాజు ఆలయ పదో వార్షికోత్సవ వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు హోమాలు, పూజలు వేడుకగా జరిగాయి. మధ్యాహ్నం అన్న సంతర్పణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి అమ్మవార్ల పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈపీఎంఎంసీఎల్ చైర్మన్ దినేష్‌రెడ్డి, స్థానిక నాయకులు పి.శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కె.అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా రామకృష్ణయ్య

మనుబోలు: పీఏసీఎస్ చైర్మన్‌గా మండలంలోని బద్దెవోలు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పొన్నూరు రామకృష్ణయ్య, డైరెక్టర్లుగా ఉడతా విజయ్‌కుమార్, సాని వెంకటరమణయ్య నియమితులయ్యారు. వీరు గురువారం ఎమ్మెల్యే సోమిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు డ్రోన్ అందజేత

మనుబోలు: పురుగు మందు పిచికారీ చేసే డ్రోన్‌ను రైతులకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అందజేశారు. కొమ్మలపూడికి చెందిన వార్డు మెంబర్ చనిపోవడంతో వారి కుటుంబానికి రూ.లక్షల చెక్కును అందజేశారు.

పశువుల సంత నిర్వహణకు వేలం



హక్కుల పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

మనుబోలు: 2025 – 26 సంవత్సరానికి మనుబోలు పంచాయతీ పరిధిలోని పశువుల సంత నిర్వహణ హక్కులకు గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కంచి పద్మమ్మ, పంచాయతీ విస్తరణాధికారి నారాయణ అధ్యక్షతన వేలంపాట జరిగింది. 8 మంది ఇందులో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన కంటేపల్లి సుధాకర్ గరిష్టంగా రూ.30 లక్షలకు హక్కులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండల పరిధిలోని సర్వేపల్లి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గూడూరుకు చెందిన కిశోర్‌బాబు బైక్‌పై కృష్ణపట్నం పోర్టుకు వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి వెళ్తున్నాడు. సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద పోర్టు రోడ్డుపై లారీ అడ్డుగా రావడంతో అదుపు తప్పాడు. గాయపడిన కిశోర్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

విత్తనాభివృద్ధితో అధిక లాభాలు



బుచ్చిరెడ్డిపాళెం : మాట్లాడుతున్న ఏడీ అనిత



కోవూరులో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రైతులు వరిసాగులో విత్తనాభివృద్ధి చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని కోవూరు వ్యవసాయశాఖ ఏడీ అనిత అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని వవ్వేరు కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌లో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు వరిసాగులో విత్తనాభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ విత్తనాభివృద్ధిలో సరైన మెళకువలు పాటించాలన్నారు. నాణ్యత గల విత్తనాలను ప్రభుత్వంతో పాటు, ప్రైవేటు సంస్థలు అధిక రేటుకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వివిధ కారణాల వల్ల అన్నదాత సుఖీభవ నగదు జమకాని రైతులు తన కార్యాలయంలో సంప్రదించి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించాలని కోరారు. మండలంలో ఇప్పటివరకు 50 శాతం ఈ–పంట పూర్తి చేశామని, త్వరలో మిగతా 50 శాతం పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని వివరించారు. ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతులు మంచి విత్తనాలను అభివృద్ధి చేయగలిగితే మద్దతు ధర కంటే 30 శాతం అదనంగా నగదు చెల్లించి కొనుగోలు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీహరి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

• కోవూరు: కోవూరులో ఆత్మ సౌజన్యంతో రైతులకు పంటలపై తాజా సాంకేతిక పద్ధతులను గురువారం వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వినీత వరిలో కొత్త వంగడాల ప్రాముఖ్యత, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. ఏడీఏ అనిత 'అన్నదాత సుఖీభవ' పథకంపై రైతులకు పలు సూచనలు చేశారు. ఆగస్టు 20లోపు ఫిర్యాదులు, సమస్యలను వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఈ–పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ టి.రజని, రైతు నాయకుడు మల్లారెడ్డి, వీఏఏలు రామలక్ష్మి, మెహరున్నిసా, నారాయణ, రాజశేఖర్, ప్రభ, కల్యాణి, ఆసిఫా పాల్గొన్నారు.


కౌలు రైతు సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మండల కౌలు రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. మండల కమిటీ కార్యదర్శిగా మునుస్వామి, అధ్యక్షుడిగా లక్ష్మయ్య, కార్యదర్శులుగా సురేష్, కేశవులు, ఉపాధ్యక్షుడిగా యానాదయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం మాట్లాడుతూ కౌలు రైతులకు కూడా అన్నిరకాల హక్కులు కల్పించాలన్నారు. అన్నదాత సుఖీభవ, బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందించి వారి అభివృద్ధికి దోహదం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరుగనున్న పంద్రాగస్టు వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై సంతోష్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వేదిక నిర్మాణం, కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు, అధికారులు, ప్రజలకు తగిన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ, మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాకాణి పూజితకు అభినందనలు



పూజితను అభినందిస్తున్న నాయకులు

పొదలకూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మండలంలోని దుగ్గుంట పంచాయతీ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం కలిసి అభినందించారు. ఆమెకు శాలువాలు కప్పి పార్టీలో కీలక నాయకురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, సర్పంచ్ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి సీపీఐ మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

ముత్తుకూరు(పొదలకూరు): సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సర్వేపల్లి నియోజకవర్గ కార్యదర్శి తుంగ ఏడుకొండలు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నాయకులతో కలిసి మాట్లాడారు. ఈనెల 17, 18, 19 తేదీల్లో నెల్లూరు నగరం బారకాస్ సెంటర్ నుంచి కోటమిట్ట షాదీమంజిల్ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు సభలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముజీబ్, పెంచలయ్య, ఆదిశేషయ్య, ప్రసాద్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, రమణయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

బాబా మందిరాల్లో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకి సేవ నిర్వహించారు.

⇨ మనుబోలు: మండలంలోని మనుబోలు, జట్ల కొండూరు గ్రామాల్లో సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ బాబా విగ్రహాలకు పుష్పాలంకరణ చేశారు.

మోటార్ల చోరీపై కేసు నమోదు

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరులో పి.నారాయణ అనే వ్యక్తికి చెందిన విద్యుత్ మోటార్ల చోరీ జరిగినట్టు ఫిర్యాదు అందడంతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. సోమవారం నారాయణకు చెందిన మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.